


"అలివేణీ........వేణీ........"

కృష్ణమూర్తి భార్యను పిలిచి తలుపు మీద టకటక శబ్దం చేశాడు.

దభీమన్న శబ్దం కర్ణకఠోరంగా వినిపించింది.

కృష్ణమూర్తి ఉలిక్కిపడి – ఆకాశం ఉరిమిందా అని అనుమానంరాగా అరుగు చివరకువచ్చి పైకి చూశాడు. ఆకాశం ప్రశాంతంగా ఉంది. ఏమయి ఉంటుందా అని ఆలోచిస్తూ వెనక్కువచ్చి తలుపు తోశాడు తలుపు తె చుకుంది. అప్పుడు తట్టింది కృష్ణమూర్తికి ఇందాకటి శబ్దం తలుపు గడియ తీయడంలో ఉద్భవించి ఉండవచ్చునని – అయితే గడియ అంత శబ్ద మెందుకు చేస్తుంది?

అమాయకుడైన కృష్ణమూర్తికి, కారణం తెలియలేదు. భార్యనే అడిగి తెలుసుకోవాలనుకున్నాడు. రోజూ తలుపు తట్టగానే నవ్వుతూ ఎదుట నిలిచే అలివేణి ఈ వేళ అలా నిలవక పోడానికీ, తలుపు గడియ ఎక్కువ శబ్దం చేయడానికీ ఏదో సంబంధం ఉందని అతనికి తట్టలేదు.

"వేణీ! మంచినీళ్ళు" కృష్ణమూర్తి బూట్లు విప్పుకుంటూ పిలిచాడు. రోజూలా "వస్తున్నా" అనికాని "తెస్తున్నా" అని కానీ సమాధానం రాలేదు. కుడికాలి బూటు విప్పుతూండగా మళ్ళీ మరో శబ్దం కృష్ణమూర్తిని ఉక్కిరి బిక్కిరి చేసింది. ఏమిటా అని అతను వెనక్కి తిరిగి చూశాడు.

విసవిసా నడుస్తూ వంటింటికేసి వెళ్ళిపోతున్న అలివేణి కన్పించింది. "అరే– అదేమిటి – అలా వెళ్ళిపోతోంది" అనుకుని టేబుల్ వంక చూశాడు. టేబుల్ మీద మంచినీళ్ళ గ్లాసు పెట్టిఉంది. టేబిల్ నిండా నీళ్ళు ఒలికాయి. గ్లాసులో సగానికే నీళ్ళు ఉన్నాయి.

ఇప్పటికి కృష్ణమూర్తి బుర్ర పని చేయడం ఆరంభించింది. ప్రొద్దుటికీ, ఇప్పటికీ అలివేణిలో ఏదో పెద్దమార్పు వచ్చిందని అతను గ్రహించాడు. అది

కోపమే కావచ్చునని కూడా ఆతని ఊహకు తట్టింది.

అలివేణికి కోపం వచ్చిందన్న ఊహ తట్టడంలో నే కృష్ణమూర్తికి మతిపోయి నట్లయింది. ఆమెకు కోపం వస్తే తను బ్రతకలేడని అతనికి అనిపించింది. వెంటనే ఆతనువంటింట్లోకి పరుగెత్తాడు.

యూనివర్సిటీల్లోనూ, కాలేజీల్లోనూ సంగతి ఎలాగున్నా దాంపత్య జీవితంలో మాత్రం పురుషులకంటె స్త్రీలే తెలివైన వాళ్ళు. ఒక్క మాటకూడా మాట్లాడ కుండా తనకు కోపం వచ్చినట్లు భర్తకు తెలియజేసిన అలివేణి అతను వచ్చే సమయానికి కత్తిపీటమీద కూర్చుని ఉంది. అతను రావడంతోనే అంత సేపూ గుమ్మానికెదురుగా ఉన్న కత్తి పీటని గోడవైపు కఠినంగా తిప్పింది.

"వేణీ-కోపం వచ్చిందా?"

కృష్ణమూర్తి ఎంతో ఆరాటంగా ప్రశ్నించి ఆమెను సమీపించాడు.

అలివేణి అతని వంక చూడలేదు. అతనే బలవంతంగా ఆమె ముఖాన్నితన వైపుకు తిప్పుకున్నాడు. అలివేణి కళ్ళ నుంచి ధారాపాతంగా నీళ్ళు కారు తున్నాయి.

"ఛ - ఏడుస్తున్నావా?" అన్నాడ తను. ఆమె మాట్లాడకుండా ముఖాన్ని పక్కకు తిప్పుకుంది. "కోపం వచ్చిందా వేణీ - చెప్పు — నేనేం పొరపాటు చేశాను?"

"మీ నంగనాచి కబుర్లకేంలెండి — ఇంత మోసం చేస్తున్నారని నేను కలలో కూడా అను కోలేదు." అలివేణి నోటి నుంచి మొదటిసారిగా మాటలు వచ్చాయి.

ఆమె మాటల్లోని అర్థం కృష్ణమూర్తి కి తెలియలేదు. నేను నిన్ను మోసం చేయడమేమిటి వేణీ.... ఏమిటో కొత్తగా మాట్లాడుతున్నావ్?"

"అవును నానోటి నుంచి వినడం కొత్తే అయినా - ఇదిచాలా కాలంగా జరుగుతున్న పాత విషయమేగా...."

"ఏమిటావిషయం?" కృష్ణమూర్తి అయోమయంగా అడిగాడు.

"నాకర్మకాలి .... ఆ విషయంకూడా నాచేతనే చెప్పించాలా?" ఇలాఅని అలివేణి అక్కడినుంచి లేచి పడకగది లోకి వెళ్ళిపోయింది.

కృష్ణమూర్తి ఏమీ అర్థంకాని ఒక అయోమయావస్థలో ఉండిపోయాడు. ఆ అవస్థలోంచి అతను తేరుకుని పడకగది లోకి వెళ్ళేసరికి అలివేణి ఒక తలగడాని కన్నీటితో పూర్తిగా తడిపేసింది.

ఆడవాళ్ళ కన్నీరు చూడదుర్భరం. అందుచేతే కృష్ణమూర్తి మరోసారి భార్యని బ్రతిమాలాడు "నువ్విలా ఏడు స్తూంటే నేను చూడలేనని తెలిసుకుని నన్నెందుకిలా ఏడిపిస్తావ్! అసలు నీకు కోపం ఎందుకొచ్చిందో చెప్పు- నువ్వేం చెయ్యమంటే అవి చేస్తాను ...."

"ఇంకా ఎందుకు బుకాయిస్తారు. నన్నేడిపించడం సరదా కాబట్టి ఇలా ప్రవర్తిసున్నారు".

ఈ సారి కృష్ణమూర్తికి కొద్దిగా కోపం వచ్చింది. "అసలు విషయ మేమిటో చెప్పకుండా ఏమేమిటో అంటే నాకేం తెలుస్తుంది సరే-నీ కోపం తగ్గే కనే ఇంటికి వస్తానే........"కోపంవస్తే ఇంట్లోంచి పోతానని బెదరించడం తప్ప

మరొకటి చేతకాని చాలామంది మగవాళ్ళ లాగే కృష్ణమూర్తికూడా అన్నాడు.

సమయానుకూలంగా విషయాలు చెప్పే నేర్పు ఆడవాళ్ళకే ఉంది. "మీకేం తెలియదు పాపం! ఈ ఉత్తరం సంగతికూడా........"

ఉత్తరం అన్న ఓ కొత్తపదం బయట పడటంతో కృష్ణమూర్తి వెనక్కు తిరిగాడు అలివేణి చేతిలో ఓ ఉత్తరం ఉంది కృష్ణమూర్తి వెళ్ళి ఉత్తరాన్ని తీసుకొన్నాడు. అలివేణికి కోపం తెప్పించిన ఆ ఉత్తరంలో ఏముందా అనే కుతూహలంతో అతను ఆ ఉత్తరాన్ని చదవటం ప్రారంభించాడు.

ప్రియమైన కృష్ణమూర్తికి—

"నీవద్దనుంచి ఈ మధ్య ఉత్తరాలు రావడంలేదు. కారణం తెలియక చాలా బాధపడుతున్నాను. బీచికికూడా రావడం మానేశావు. ఒంటరిగా వచ్చిన నన్ను చూసి బీచివద్ద సముద్రపు అలలు నన్ను పరిహసిస్తున్నాయా అనిపిస్తోంది. మన మిద్దరం కలిసి అక్కడ కూర్చున్నప్పుడవి ఎంత ఆహ్లాదకరమైన సంగీతం వినిపించేవి?

ఈ ఉత్తరం చూడగానే నా బాధను అర్థం చేసుకోగల సమర్థత నీకున్నదని నాకు తెలుసును. అందుకే నేటి సాయంత్రం బీచి దగ్గర నన్ను కలుసుకుంటావని నమ్ముతున్నాను.

నీ

రాధ.

ఉత్తరం చదువుతున్నంతసేపూ కృష్ణమూర్తి ముఖంలో భావాల్ని—[illegible] పరిశీలించడానికని అతని వైపే చూస్తున్న అలివేణి — అతను ఉత్తరం పూర్తి చేయగానే అటు పక్కకు తిరిగింది. ఆమెకు కృష్ణమూర్తి నవ్వు వినిపించింది.

"వేణీ! నువ్వెంత వెర్రిదానివి కాకపోతే ఈ ఉత్తరాన్ని నమ్ముతావు? ఎవరో సరదాకు రాసి ఉంటారు, లేకపోతే ఎవరో రాధ నాకు ఉత్తరం రాయడమేమిటి? నాకంతటి అదృష్టంకూడానా"

"అయితే—ఇదెవర్తో మీకు ఉత్తరం రాయడం మీ అదృష్టమంటారు" అని వేణి మళ్ళీ ఈ పక్కకు తిరిగింది. కృష్ణమూర్తి తన పొరపాటు గుర్తించాడు. మెల్లిగా మంచందగ్గరకు చేరి అవల కూర్చుని—"అలివేణీ! ఇలా నా కళ్ళలోకి సూటిగా చూసి చెప్పు. నేను నిన్ను మోసం చేస్తానంటే నువ్వు నమ్ముతావా?" అన్నాడు సీరియస్‌గా.

ఈ మాటలు అలివేణిని కొద్దిగా కదిలించినట్లున్నాయి — అతనివంక ఓరగా చూసిఅంది—"మరి—ఆ .... ఉత్తరం"

"నిజం చెబుతున్నాను. ప్రమాణపూర్తిగా ఆ రాధఎవరో నాకు తెలియదు. ఎవరో సరదాకు రాసిఉండాలి —"

"అయితే ఎవరు రాసిఉంటారు?"

"అదే ఆలోచనకు అంతు పట్టడంలేదు"

అలివేణి మాట్లాడకుండా కాస్సేపు కృష్ణమూర్తి ముఖంలోకి చూస్తూ కూర్చుంది. కృష్ణమూర్తి భార్య మెత్తపడుతోందని గుర్తించాడు మెల్లిగా ఒక్కొక్క అస్త్రాన్నే ఉపయోగించ సాగాడు. "నా అదృష్టంకొద్దీ నువ్వు దొరికావని మురిసిపోతూంటాను. అటువంటిది నిన్ను

కాదని కలలోకూడా మరొకరిని తలుస్తానని ఎలా అనుకున్నావు .... ఇలా చూడు .... నీవు లేకపోతే నేను బ్రతకలేను .... నన్ను నమ్మవేణీ .... నీకోపాన్ని నేను సహించలేను."

అతని ఈ మాటలు పూర్తయేసరికి అలివేణి కృష్ణమూర్తి ఒడిలో వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చేసింది.........

* * *

"రాధా....నీకోసం ఏం తెచ్చానో తెలుసునా ?

"చూడందే ఎలా తెలుస్తుంది?"

"తెలుస్తుంది కాబట్టే నువ్వు రాధవి-మరి చెప్పుకో........"

"ఉంగరం తీసుకొచ్చావా?"

"ఆహాఁ" అతను నవ్వి-"ఏదీ-మరి చేయిచాపు" అన్నాడు.

ఆమె చేయి చాపింది. ఉంగరం ఆమె వ్రేలి నలంకరించింది.

"అన్నమాటను నిలబెట్టుకోడంలో మీరింత గొప్పవారని నేననుకోలేదు కృష్ణమూర్తి గారూ !"

"ఎందుచేత?"కృష్ణమూర్తి నవ్వాడు.

"మీ కోసం నాలుగు రోజులుగా ఎదురు చూస్తూ కూర్చుంటే చూసిన ఈ వీధి నడగండి చెబుతుంది"

"క్షమాపణకోసమేగా ఈ ఉంగరం" ఇద్దరూ నవ్వేశారు.

* * *

బూట్లు విప్పుకుంటూన్న కృష్ణమూర్తికి భార్యకంఠం వినిపించింది. "ఇలా ఓ సారి లోపలికి రండి...."

ఆ కంఠస్వరంలోని తీవ్రత కృష్ణమూర్తిని కొద్దిగా భయపెట్టింది. ఆనాటి ఉత్తరంనుండీ అలివేణి ప్రవర్తనలో మార్పువచ్చింది. ప్రతి విషయాన్నీ నిశితంగా పరిశీలిస్తోంది. మనసిచ్చి మాట్లాడడం మానేసింది.

"మిమ్మల్నే !"

కృష్ణమూర్తి ఉలిక్కిపడి గదిలోకి వెళ్ళాడు "మీ వ్రేలిన ఉంగరం ఏదండీ !" గతుక్కుమన్నాడు కృష్ణమూర్తి ఈ విషయం ఎలా పసిగట్టింది చెప్మా అనుకున్నా డతను ముందు. పోనీ నిజం చెప్పేస్తే ఏం ? అనిపించింది తరువాత. "ఇంకేమైనా ఉందా ?" అంది

తబ్బిబ్బుపడుతూ – "ఉంది !" అన్నాడు.

"ఎక్కడ ? రాధాదేవి వ్రేలినా ?"

మళ్ళీ ఈ రాధ రంగంలో ప్రవేశించిందా అని భయపడ్డాడు కృష్ణమూర్తి. కంఠంలోకి కొంత గాంభీర్యం తెచ్చుకుని "ఎందుకలా పొరబడతావు వేణీ ! నా మిత్రుని కొకడికి అవసరంగా కావాలంటే తాకట్టుపెట్టి...."

చాల్లెండి బుకాయిస్తారు. ఈ ఉత్తరం చూడకపోతే – నేనూ మీ మాటలకు మోసపోయేదానినేమో...."

మళ్ళీ ఏదో ఉత్తరం అలివేణిచేతిలో వెలిసింది. "పరమేశ్వరా ! నేనేం పాపం చేశానని నా కిటువంటిశిక్ష విధిస్తున్నావు" అనుకున్నాడు కృష్ణమూర్తి. అనుకుంటూనే ఉత్తరం అందుకుని చదివాడు.

ప్రియమైన కృష్ణమూర్తికి—

ఆ నాడు ఉంగరం ఇచ్చేక మళ్ళీ నీ దర్శనం కాలేదు. ఏమై పోయావో తెలియదు. నీతో మాటాడవలసిన ముఖ్య విశేషం ఒకటుంది. అదేమిటో నీకూ

తెలిసే ఉంటుంది. రేపు సాయంత్రం తప్పకుండా బీచికి రావాలి. వీలుంటే నేనే మీ యింటికి ఒకసారి వస్తాను. నేను వచ్చినా రాకపోయినా తప్పక వస్తావు కదూ ?

నీ
రాధ

"ఎవరీరాధ ! " గట్టిగా అరిచాడు కృష్ణమూర్తి
"అది మీకే తెలియాలి" కోపంగా జవాబిచ్చింది అలివేణి.

"ఎవరో మనతో వేళాకోళం ఆడుతున్నారు వేణీ ! నీవు నన్ననవసరంగా అనుమానిస్తున్నావు. నేను నిన్ను మోసం చేస్తానంటే ఎలా నమ్ముతున్నావు అలివేణీ ! " కృష్ణమూర్తి బాధగా అన్నాడు.

అతని మాటలు అలివేణిని కరిగించలేదు. "యిలా కల్లబొల్లి మాటలు చెప్పే మొన్న నమ్మించారు ఈ ఉత్తరం వచ్చేక కూడా ఇంకా నన్ను నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. ఛీ! మీ మగవాళ్ళకి సిగ్గులేదు .... "ఆమె ఏడుస్తూ పక్క గదిలోకి వెళ్ళిపోయింది.

కృష్ణమూర్తికి ఏమీ తోచలేదు. ప్రశాంతంగా నడుస్తున్న తన జీవిత నౌక ఇప్పుడు తుఫాను నెదుర్కుంటోంది. అందుకు రాధ ! కారణం ఆమె ఎవరు ?....

ఆలోచిస్తున్న కొద్దీ కృష్ణమూర్తికి తలనొప్పి వచ్చింది. అలివేణితో నాలుగు నిముషాలు కులాసాగా మాట్లాడితే అతని తల నొప్పి పోతుంది. కానీ- ఇప్పుడా అవకాశం ఏదీ ? అతను మళ్ళీ బూట్లు తొడుక్కుని- "ఏడయ్యే సరికలా వచ్చేస్తాను." అని అక్కడున్న తలుపుతో చెప్పి వీధిలోకి నడిచాడు.

గదిలోంచి బైటకు వచ్చి - "బీచికి కోబోలు" అన్న అలివేణి మాటలు అతనికి వినిపించలేదు.

అతని నిర్లక్ష్యం ఆమెను కలిచివేసింది. తనకు తెలియకుండానే తనకు దూరమైపోతున్న భర్తను! ... ఆమెకెంతో భయం వేసింది. కళ్ళముందు భవిష్యత్తు భయంకరంగా నిలబడింది.

కృష్ణమూర్తి ఇలా మారడానికి కారణం ఏమిటి ? తనంటే ప్రాణంయిచ్చే ఆయనలో ఇలాంటి బుద్ధి ఎందుకు పుట్టింది ? ఒకవేళతను పొరబడటంలేదు కదా ! తనుపొరబడి నట్లయితే మరి ఆయనకు వచ్చిన ఉత్తరాలు ?....

లేదు. ఆయన మారిపోయారు.

ఆయనలో ఈ మార్పుకు కారణం ! ఎవరో....రాధ ! ఆమె ఈయనను తన వలలో వేసుకుంది. బహుశా డబ్బు కోసం కాబోలు. ఛీ ! డబ్బుకోసం ప్రపంచంలో ఎటువంటి పని చేయడానికీ వెనుదీయరు.

ఆ సమయంలో ఆమెకు మరో సందేహం కలిగింది. ఒకవేళ వారు ఆమెను మోసం చేయడంలేదుకదా ! ఆమెకు తెలియదేమో - వారు వివాహితులని.... ఇంతకూ ఆమె ఎవరు ?

"కృష్ణమూర్తిగారిల్లు ఇదేనాండీ ?"

అలివేణి తలెత్తి చూసింది. ఎదురుగా పద్దెనిమిదేళ్ళ అందమయిన అమ్మాయి. ఆమె ఎవరో అలివేణికి

తెలియలేదు. "ఆఁ ఇదేనండి. మీరెవరు?"

"కృష్ణమూర్తిగారున్నారాండీ!"

"లేరు – ఆయనతో మీకేంపని?"

ఆ అమ్మాయి ముఖంలో సిగ్గుతెరలు కన్పించాయి. "ఆయనలేరా? – మళ్ళీ వస్తానులెండి!" ఇలాఅని వెనక్కైనా తిరక్కుండా వెళ్ళిపోయిందామె.

అలివేణి నివ్వెరపోయింది. ఎవరా అమ్మాయి?

ఇంకెవరు – రాధే అయిఉంటుంది....

ఆమెచాలా అందంగాఉంది. చక్కగా మాట్లాడుతోంది. చదువుకున్న దానిలా కూడావుంది. నడకలో వయ్యారాలు....

ఇవన్నీకలిసి వారినిమోసగించాయా?

అలివేణికి భయంవేసింది. తనెంతో అందమైనదని గర్వపడుతూ ఉండేది. రాధఅందం తన్నుమించింది. ఆ అందానికి ఆయన లొంగిపోయారు.

అందంమీద అంత మక్కువున్నప్పుడు ఆయనసలు తననెందుకు వివాహం చేసుకోవాలి? అంతగా ఆలోచిస్తే ఆయనమాత్రం – అపర మన్మథుడిలా ఉంటారా? అయితే ఎప్పుడైనా తన మనసులో చెడు ఊహలు వచ్చాయా? మగవాళ్ళది చపలస్వభావం – తన భర్తలాంటి మగవాళ్ళవలన – తనవంటి భార్యలింకా ఎంతమంది ఇబ్బంది పడుతున్నారో....

రాధవంటి ఆడవాళ్ళు కూడా తనకు శత్రువులే – ఇందాక వచ్చిన ఆమె రాధేనా? కాకపోతే ఇంకెవరై ఉంటారు.

ఆలోచించడానికి విసుగుపుట్టి వంటింట్లోకి నడిచింది అలివేణి. వంటింట్లో వంకాయలని చూసేసరికి కృష్ణమూర్తి మీది కోపమంతా వాటిమీదకు మళ్ళింది. ఆమెకు వాటిని ముక్కలు ముక్కలుగా నరికేయాలనిపించింది. ఫలితంగా–కూర చేద్దామనుకున్న ఆమె వేపుడు చేయాల్సి వచ్చింది.

కృష్ణమూర్తికి ఇంటికొచ్చే సరికి వేపుడు ముక్కలు ఘుమఘుమ లాడుతున్నాయి. "అయితే ఈ పేట్కి – దేవి ప్రసాదం రుచి చూసే అదృష్టంఉందన్నమాట" అనుకున్నాడు. అలివేణి కోపం కూడా పోయుంటుందని అతని కనిపించింది.

బూట్ల చప్పుడు అలివేణికి వినిపించింది. తక్షణం ముక్కల్లో కారంవేసి విసవిసా నడవలోకి వచ్చి – "మీకు టీ పార్టీ ఇవ్వా లనుకుంటున్నాను" అంది

"ఎందుకు?" కృష్ణమూర్తి నవ్వడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

"అంత అందమైన ప్రియురాల్ని సంపాదించుకున్నందుకు!"

"నాకా? ప్రియురాలా —!"

"ఇంకా నటించడంకూడా ఎందుకు? మీ ప్రియురాలు రాధను నేను కళ్ళారా చూశాను!"

"ఎక్కడ?"

"ఆమె వెతుక్కుంటూ మీకోసం ఇక్కడికే వచ్చింది!" ఈ మాటలు అన్నతరువాత అలివేణి కళ్ళలోని నీళ్ళు ఇంక ఆగనన్నాయి. ఆమె రెండు చేతులతో ముఖం కప్పుకుంది.

అంతకష్టంలోనూ, తన కోసం వెతుక్కుంటూ ఓ అమ్మాయి వచ్చిందనేసరికి కృష్ణమూర్తికి గర్వమే కలిగింది. కానీ–అలివేణి కళ్ళనీళ్ళలో అదికూడా

కొట్టుకపోయింది. "అలివేణీ! నీ కెలా నచ్చజెప్పాలో నాకు తెలియడంలేదు. నిజంగా ఆ రాధెవరో నాకు తెలీదు. నీవేమో—ఆమె మనింటికి వచ్చిందంటున్నావు. పోనీ—నేను వచ్చేదాకా ఆమెను ఆపచేయలేకపోయావా?"

"ఇన్నాళ్ళుగా కాపురం చేస్తూకూడా మిమ్మల్ని ఆపలేని నేను-ఎవరోముక్కు-మొహం తెలియని అమ్మాయిని ఆపగలనా?"

"ఇన్ని మాటలెందుకు? నేనేంచేస్తే నా మాటలమీద నమ్మకం కలుగుతుందో చెప్పు — నువ్వు చెప్పినట్లే వింటాను"

"ఇంకమీరేదిచెప్పినా నేనునమ్మను" అలివేణి ఖచ్చితంగా చెప్పేసింది. కృష్ణమూర్తి నిస్సహాయుడిగా నిలబడిపోయాడు. అలివేణి అలా నించోలేదు. గదిలోకిపోయి మంచంమీద పడుకుంది.

తనకింక భోజనానికాహ్వానం రాదని గుర్తించాడు కృష్ణమూర్తి. అతనికి విపరీతంగా ఆకలేస్తోంది. అడగడాని కభిమానం అడ్డొచ్చింది. అతను ఆలోచించాడు. జేబులో పర్సుఉంది. పర్సులో డబ్బువుంది.

అతను మళ్ళీ బూట్లు తొడిగాడు.

హోటలునుంచి భోజనం చేసివచ్చేక కృష్ణమూర్తికి పరిసరాలమీద దృష్టి కలిగింది. అతనికి అలివేణిమీద కోపం కూడా వచ్చింది. ఏవేవో అనుమానాలను పెట్టుకొని-అమాయకుడైన తన్ననుమానిస్తోంది. అతను తన్ను తానే ప్రశ్నించుకున్నాడు. "అలివేణి తననుమానించడం తప్పా?"

సరియైన సమాధానం అతనికి లభించలేదు. ఏది ఏమైనా తనంత తానుగా వచ్చి మాట్లాడేదాకా అలివేణితో మాట్లాడకూడదని అతనునిశ్చయించుకున్నాడు. ఇదే నిశ్చయంతో - ఇల్లు చేరగానే మాట్లాడకుండా మడతమంచాన్ని తీసుకొని వెళ్ళి దొడ్లో వేసుకున్నాడు.

మానవుడి కెప్పుడూ అందుబాటులో లేనివాటిమీద కాంక్ష కలుగుతూంటుంది. ఇటువంటి విషయాల్లో భగవంతుడు కూడా చాలారకా పరిస్థితులను వ్యతిరేకంగా కల్పిస్తూంటాడు.

ఆ రాత్రి నిండు పున్నమి. తెల్లని వెన్నెల నేలనిండా పరుచుకుంది. చల్లగాలి శరీరాన్ని తాకుతోంది. దొడ్లో నైట్‌క్వీన్ పరిమళం వీటి ఫలితంగా కృష్ణమూర్తి మనస్సులోని కోపం అంతరించిపోయింది. అతనికి పదే పదే అలివేణి జ్ఞాపకం రాసాగింది.

ఆ రాధ ఉత్తరాలు రాయకపోతే - ఈ రాత్రి ఎంత మధురంగా గడిచివుండేది? ఏది ఏమైనా అతను నిస్సహాయస్థితిలో ఉండిపోయాడు ఏమైనా ఒక్కసారి అలివేణిని పలకరించాలనిపించింది. మళ్ళీ అంతలోనే ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. తొలిసారిగా కృష్ణమూర్తికి విరహం అంటే యేమిటో తెలిసింది.

అలివేణికీ తనకూ యిప్పుడున్నది ఇరవై గజాల దూరం! కానీ - ఈ ఇరవై గజాల మధ్య పెద్ద అగాధం! దాటలేని అగాధం!! ఎలా దాటేది?

ఒక్కటే ఉపాయం - ఆ రాధ యెవరో తెలియాలి! అంటే రేపు బీచికి వెళ్ళాలి - ఆమె ఎవరో తెలుసుకోవాలి.

ఆమె ఎవరో నిజంగా తనకు తెలియదా? పడుకోబోయే ముందు తన మనసు నోసారి ప్రశ్నించుకుని పడుకున్నాడు కృష్ణమూర్తి. అదృష్టవశాత్తు అతనికి నిద్ర త్వరగానే పట్టింది....

* * *

సాయంత్రం నాలుగున్నరకి కృష్ణమూర్తి బీచిదగ్గర ఉన్నాడు. ఆడవాళ్ళు ఎక్కువగా వచ్చేచోట నిలబడి ప్రతీ అమ్మాయినీ పరీక్షగా చూడడం ప్రారంభించాడు చూచిన వారిలో ఏ ఒక్కరికీ కూడా రాధ అన్నపేరు తగదని నిర్ణయించుకొని వాళ్ళలో రాధ లేదని ఊహించుకున్నాడు.

అసలు రాధ ఎలా వుంటుంది? రెండు జడలు, – హైహీల్సు – టెరిలిన్ చీర వేస్తుందా లేక ఒకే ఒక జడవేసుకుని – సంసార పక్షంగా ఉంటుందా?

ఇలా ఆలోచిస్తుంటే అతనిమనసతన్ని విసుగ్గా ప్రశ్నించింది. "మూర్ఖుడా! రాధెలా ఉంటుందో నీకు తెలియదేం? ఏమీ ఎరుగని ఆమె నీకు రెండు ఉత్తరాలు రాస్తుందేం? అందులోనూ ఉంగరం........"

కృష్ణమూర్తికి జవాబు దొరకలేదు. అతను అయోమయావస్థలో పడిపోయి ఒకసారి చుట్టూ చూశాడు. దూరంగా నల్లరాతిమీద నిలబడి ఉన్న ఒక అమ్మాయి కనిపించింది.

ఆ అమ్మాయి ఒంటరిగా ఉంది. రాధ కూడా ఒంటరిగానే వస్తుంది తనకోసం ఎదురుచూస్తూ – కృష్ణమూర్తికి ఆలోచన రావడంతోటే అటే నడిచాడు.

గాలికి ఎగిరే తెల్లని ముంగురులు, చంద్రబింబంలాంటి అందమైన ముఖం, పచ్చని శరీరచ్ఛాయ .... ఆ సంధ్యాసమయంలో ఆమె ఎంతో అందంగా మెరిసిపోతోంది. కృష్ణమూర్తిలోని పురుష స్వభావం అంత విచారంలోనూ ఆమె లోని అందాన్ని చూడగలిగింది.

కృష్ణమూర్తిని ముఖ్యంగా ఆకర్షించినవి ఆమె కళ్ళు! అవి ఎవరికోసమో వెదుకుతున్నట్టున్నాయి. ఈమే రాధ అయిఉండవచ్చునని కృష్ణమూర్తికి తట్టింది. ఆమెకు మరింత దగ్గరగా వెళ్ళాడు.

దూరాన్నించి తననే చూస్తున్న ఈ యువకుణ్ణి ఆమెగమనిస్తూనే ఉన్నామరీ యింత వస్తాడని ఆమెఊహించనట్టుంది. ముఖంలో కొంచెం కంగారుకనిపించింది. కళ్ళల్లో కోపం కూడా ఉంది. ఇవేమీ పరిశీలించకుండా కృష్ణమూర్తి – "మేడమ్ మీ పేరు...." అని అడిగాడు.

"ఎందుకు?" చాలా కోపంగా అడిగింది ఆమె.

కృష్ణమూర్తికి ఆడవాళ్ళతో మాట్లాడ్డానికి భయం ఎక్కువ. అందులో కోపం ఉన్న ఆడవాళ్ళతో మరీనూ – అందుకే కాబోలు అతని కాళ్ళు వణికాయి. మాటతడబడింది. "మరేమీ లేదు నా పేరు కృష్ణమూర్తి మీ పేరు రాధే అయితే ఒక చిన్న పని ఉంది." తన పేరు చెబితే ఆమెకు విషయం అర్థం కాగలదనే ఉద్దేశ్యంతో కృష్ణమూర్తి అలా చెప్పాడు.

అయితే ఈ మాటలను ఆమె ఇంకో విధంగా అర్థం చేసుకుంది. అతనిపేరు కృష్ణమూర్తట – తనపేరు రాధఅయితే

ఒక చిన్నపని ఉందిట – కృష్ణుడికి రాధతో ఏంపని ఉంటుంది! "ఏమిటా పని!" ఆమె తీవ్రతను హెచ్చించి అడిగింది.

"అది చెప్పాలంటే మీరు పేరు చెప్పాలి –"

ఆమెకు కోపంతగ్గి కుతూహలం పెరిగింది. కృష్ణమూర్తిమీద ఒకవిధమైన అనుమానంకూడా కలిగినా – 'అనూరాధ' అన్నదామె.

కృష్ణమూర్తి ముఖం వికసించింది. "అమ్మయ్య– నేనెంతో అదృష్టవంతుణ్ణి – మిమ్మల్ని కలుసుకో గలిగాను."

అనూరాధ కళ్ళు చిట్లించి – "ఇంతకీ మీ పని ఏమిటి?" అంది.

"మీరు నాకు ప్రేమలేఖ వ్రాశారా? దానివల్ల ...."

అనూరాధ పళ్ళుబిగించి – "షటప్" అంది. కృష్ణమూర్తి తెల్లబోయాడు. "అయితే మీరు ఆ రాధ కారా?"

"అమాయకత్వం నటించకండి మిస్టర్! జోళ్ళు దూరంగా ఉండిపో యాయి. లేకపోతే ఏమవునో...." కృష్ణ మూర్తి ఓసారి చుట్టూ చూశాడు.

ఫరవాలేదు. ఆమె మాటలు విన డానికి అతనుతప్ప దగ్గర్లో ఎవరూలేరు. తలవంచుకుని "ఐ యామ్ సారీ!" అని అక్కడినుంచి త్వరత్వరగా ముందడుగు వేశాడు.

"రోడ్ సైడ్ రోమియో!" అని ఆమె గొణుక్కోవడం కూడా అతనికి వినిపించింది.

ఇటువంటి అవమానానికి అలవాటు పడని కృష్ణమూర్తికి తల తిరిగిపో యింది. జీవితంలో ఇటువంటి అవ మానాన్ని ఎదుర్కోవలసి వస్తుందని అత ననుకోలేదు. ఇంతకూ కారణం ఆమె .. రాధ! ఆమె ఎవరో?

కృష్ణమూర్తికి రాధమీద చాలా కోపం వచ్చింది. కనిపిస్తే ఆమెను చిత్రవధ చేయా లనిపించింది.

ఇంతకీ ఆమెపై కసి తీర్చుకోవా లంటే ఆమె కనిపించాలి. కనిపించా లంటే తను ఆమెను వెదకాలి. కృష్ణ మూర్తి మనస్సు దిటవుచేసుకుని మళ్ళీ తిరిగి రాధాన్వేషణార్థం బయలేరాడు. ఈసారి – నిలబడిన అమ్మాయిలను చూడకూడదని అతను నిశ్చయించు కున్నాడు. రాధ – తనకోసం యెదురు చూస్తూ ఎక్కడో ఒకచోట కుదురుగా కూర్చుని ఉంటుందని అతనికి తోచింది.

అసలు రాధ తనకోసం యెదురు చూస్తోందా. తను ఆమెకు తెలుసునా? అసలు ఉత్తరా లెలా రాస్తోంది?.... ఏమిటో అంతా అయోమయంగా ఉంది అనుకున్నాడు కృష్ణమూర్తి ఇంతలో కుదురుగా కూర్చున్న ఒక సుందరి కళ్ళ బడడంతో కృష్ణమూర్తి ఆలోచనకి ఫుల్‌స్టాప్ పెట్టాడు.

ఆ లలనామణి అలల సౌందర్యాన్ని తిలకిస్తూ పరవశంలో పరిసరాలనైనా గుర్తించకుండా కూర్చుని ఉంది. ఆ సౌందర్యపిపాసి తన రాధకు తప్ప మరి యెవరికీ ఉండదని కృష్ణమూర్తి అభిప్రాయపడి మెల్లిగా ఆమెను సమీ పించి, "నమస్కారమండీ! అన్నాడు. ఆమెకు ధ్యానభంగమై భ్రుకుటి ముడిచి కృష్ణమూర్తి వంక ఉలిక్కిపడి చూసి –

"నమస్కారం - ఎవరు మీరు ?" అని అడిగింది.

"నా పేరు కృష్ణమూర్తి- మీ పేరు రాధే అయితే మీతో **ఒక** చిన్న పని ఉంది." ఇందాకటి డైలాగ్సే చదివేడు కృష్ణమూర్తి,

ఆ అమ్మాయికి కోపం వచ్చేసింది. "అంటే మీ ఉద్దేశ్యం...."

"అదే చెబుతాను. నాకు మీ పేరు కావాలి"

"చెప్పకపోతే....... ...." ఆమె ఘర్జన వంటిది చేసింది.

కృష్ణమూర్తి ఆమెనుకన్విన్స్ చేయడం మొదలెట్టాడు. "చూడండి! రాధ అనే ఆమె నాకు రెండు ప్రేమ లేఖలు వ్రాసింది. వాటివల్ల నేను చాలా చిక్కుల్లో పడ్డాను. ఆమె ఎవరో నాకు తెలియదు. తెలిస్తే నా చిక్కులు తీరిపోతాయి. మీరే కనుక ఆ రాధ అయితే........ అబ్బే కోపగించుకోకండి........ మీరు కాకపోతే వెళ్ళిపోతాను" అన్నాడు కృష్ణమూర్తి అగ్ని వర్షిస్తున్న ఆమె కళ్ళను చూసి భయపడి.

"ఊరూ పేరూ తెలియని వాళ్ళకి ప్రేమలేఖలు రాసేదానిలా కన్పిస్తున్నానా మిష్టర్ - నేను మీ కళ్ళకి ? ఇంకెప్పుడూ ఇలా తెలివి తక్కువగా మాట్లాడకండి - వెళ్ళండి"

"అయితే మీ పేరు........"

"మీ కనవసరం ! మీ ఎత్తులు నాకు తెలుసు - వెళ్ళండి ! "

ఇంకా అక్కడ ఉంటే అమర్యాద తప్పదని కృష్ణమూర్తి అక్కణ్ణించి బయట పడ్డాడు. రాధను కనుక్కోవడం తనకు చేతకాని పని అని అతను గ్రహించాడు. తన అదృష్టం ఎలా ఉంటే అలా జరుగుతుందని ఇంటికే పోవాలని నిశ్చయించు కున్నాడు కృష్ణమూర్తి.

* * *

"కృష్ణమూర్తిగారున్నారాండీ !"

అలివేణి ఆ అమ్మాయివంక పరీక్షగా చూసింది. "ఉన్నారు. లోపలికి రండి."

ఆ అమ్మాయి లోపలకు వచ్చింది. "అలా కూర్చోండి" ఆ అమ్మాయి సోఫాలో కూర్చుంది.

"మీ పేరు రాధకదూ"

ఆ అమ్మాయి అందంగా తల ఊపింది.

అలివేణి హృదయం ఉడికిపోతోంది. "మీరు ఆయనను ప్రేమించారుకదూ ? కొంచెం తీవ్రంగా అడిగింది. రాధ బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కాయి. అందులోనే చిరుకోపం తొంగిచూసింది.

"అది మీ కనవసరం" అన్నదామె.

"అవసరంకాబట్టే అడుగుతున్నాను. చెప్పండి."

"ఇంతకీ కృష్ణమూర్తిగారున్నారాండీ !"

"చెబుతాను. ముందు నా ప్రశ్నకు జవాబు చెప్పండి"

"మళ్ళీ ఇంకో సారి వస్తాలెండి" అంటూ రాధలేచింది. అలివేణి తీవ్రంగా అంది. నేనెవరో మీకు తెలిస్తే నా ప్రశ్నకు జవాబు త్వరగా వస్తుందనుకుంటాను."

ఆమె కుతూహలంగా ఆగి - "ఔను. మేము పరస్పరం ప్రేమించు కున్నాం.

మీరు వారికేమవుతారు" అంది. అలివేణి నవ్వింది ."అయితే మోసపోయారు. నేనాయన భార్యను. న న్నాయన అగ్ని సాక్షిగా వివాహ మాడేరు."

రాధకు ఒక్కసారి కళ్ళ ముందు ప్రపంచమంతా గిరున తిరిగింది. "ఇది నిజమా ?"

"అక్షరాలా !" అలివేణి నవ్వుతూ నిలుచుంది. ఆమెకిప్పుడొక విధమైన సంతృప్తి ఆవహించింది రాధ "వస్తాను" అని విసవిసానడచి వెళ్ళి పోయింది.

"పాపం – ఆమె ఎవరో కాని మోస పోయింది" అలివేణి భర్తమీది కోపాన్ని మరిచిపోయి రాధమీద జాలిపడింది.

* * *

నిరాశా విస్పృహలతో కృష్ణమూర్తి ఇంటికి చేరుకున్నాడు. అతనిరాకను దూరాన్నుంచే గమనించింది అలివేణి. బహుశా రాధ ఆయనకు ఎదురుపడి ఉంటుంది. అందుకే అంత నీరసంగా ఉన్నారు కాబోలు అనుకుని కసితో కూడిన ఒకవిధమైన ఆనందం అనుభ వించింది అలివేణి.

కృష్ణమూర్తి వచ్చి కుర్చీలో కూల బడ్డాడు. అతనుచాలా చిరాగ్గా ఉన్నాడు. ఇంటికి రాగానే చిరునవ్వుతో పలకరించే చిన్నారి అలివేణి అతనిమీద అలిగింది. మరి అతని చీకాకెలా పోతుంది. కృష్ణ మూర్తి గట్టిగా తల పట్టుకున్నాడు.

"అసలు విషయం తెలియడంతో రంగం చెడినట్లుంది" అలివేణి ఇరవై నాలుగు గంటల అనంతరం మళ్ళీ కృష్ణమూర్తితో మాట్లాడింది. ఆమె మాటలు అర్థంకాక కృష్ణమూర్తి మాట్లాడ లేదు. "ఈ వేళ రాధకు నిజం చెప్పే శాను."

"ఏరాధ........" కృష్ణమూర్తి అర్థో క్తిలో ఆగి "ఆమె మళ్ళీ ఇక్కడకు వచ్చిందా ?"

"ఆఁ ఆమె రావడమూ, మీరు వివా హితులని తెలియడంతో దిగ్భ్రాంతు రాలై కన్నీళ్ళతో వెళ్ళిపోవడమూ జరిగింది." అలివేణి గర్వంగాచెప్పింది.

"చచ్చి నేను బీచిదగ్గర వెదుకు తూంటే ఆమె ఇక్కడకు తయార యిందా ! నేనామెకు చేసిన అపరాధ మేమిటో కదా...."

"ఇంతకంటే ఇంకా ఏం చేయాలి ? ఐనా మీకే మొచ్చిందండీ పెళ్ళికాని పిల్లని అలా మాయమాటలు చెప్పి మోసగించ డానికి – మీలాటి వాళ్ళని దేవుడు క్షమి స్తాడా అని...."

"అబ్బ – నే నెవరినీ మోసం చేయలే దంటూంటే...."

"ఎందుకలా బొంకుతారు. ఆ అమ్మాయి స్వయంగా ఇక్కడకు వచ్చింది మీ కోసం. ఇంకా మీకు వివాహం కాలే దనే అనుకుంటోంది...."

"ఆమె తన పేరు రాధే అని చెప్పిందా ?"

"ఆహ !"

"అయితే ఆమె ఎలా ఉందో కొంచెం చెబుతావూ ?"

వేణి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "చివ రకి నాకీగతి పట్టిందన్నమాట ! మీకు భార్యనైనందుకు మీ ప్రియురాలిని వర్ణిం చవలసిన అగత్యం...."

"నా ఉద్దేశ్యం అదికాదు వేణీ...."

"చాల్చాలెండి" అలివేణి పడక గదిలోకి పరుగెట్టింది. అదే ఆధునిక యువతుల కోపగృహం.

కృష్ణమూర్తి మళ్ళీ తలపట్టుకున్నాడు. ఆ రాధెవరో తనతో ఆటలాడుతుంది. ఆమె ఎలా ఉ టుందో తనకి తెలియదు, తెలిసిన ఒకే ఒకవ్యక్తి.... అలివేణి – తనను అపార్థం చేసు కుంటోంది.

అసలీ రాధ ఎవరు? తన విషయంలో ఈమె పొరబడ లేదుగదా! పొరబడిం దని ఎలా అనుకునేది? ఉత్తరాలు తనకే వస్తున్నాయి. మనిషికూడా తన కోసం ఇంటికి వస్తూంది. అదికూడా తను లేనిసమయంచూసి.

అంటే ఈమె తనను ఏడిపించడానికి నిశ్చయించు కుందన్నమాట! అందుకు కారణం ఏమిటో?

కృష్ణమూర్తి బాగా ఆలోచించాడు. తన బంధువుల్లో రాధ అనే పేరున్న అమ్మాయి ఉన్నట్లు అతనికి గుర్తు రాలేదు. కాక పోతే మరి ఆమె పిచ్చి దేనా అయి ఉ డాలి.

రాధను పిచ్చిదానిగా ఊహించుకోడం కృష్ణమూర్తికి బాధే అనిపించింది. ఉత్త రాలలోని సంస్కారం అతనిఆలోచనను కొట్టేసింది. అంత సేపూ ఆలోచించి కూడా కృష్ణమూర్తి ఒక నిర్ణయానికి రా లేకపోయాడు.

ఆమె ఎవరో అతనికి తెలియలేదు. అలాగే సోఫాలోనే చిన్న కునుకు తీశాడు........

తలుపుమీద టకటకమని శబ్దమయింది.

కృష్ణమూర్తికి మెలకువ వచ్చింది. మళ్ళీ యెవరో తలుపుతట్టిన శబ్దం అయింది హాల్లో లైట్ లేదు. చీకటిగా ఉంది, కృష్ణమూర్తికి లైటు వేయాలని తోచలేదు అలాగే చీకట్లో మెల్లగా తలుపు దగ్గరకు తడుముకుంటూ నడి చాడు. తలుపు కవతల సన్నగా పాట వినబడుతోంది. "నైనాభర్ సే .... రిమ్‌జిమ్ .... రిమ్‌జిమ్ ...."

ఆ పరిస్థితులలో కృష్ణమూర్తికికొద్దిగా భయమువేసింది. తలుపు తీయనా మాననా ఆలోచించాడు. ఇంతలో తను మగవాడి ననే విషయం గుర్తుకు వచ్చింది. వెంటనే తలుపు తీశాడు.

ఒక అమ్మాయి నిలబడి ఉంది. మెడలో ట్రాన్సిస్టర్ రేడియో "లోపలికి రండి!" కృష్ణమూర్తి ఆహ్వానించి లైటు వేశాడు. ఆ అమ్మాయి వెనుక ఉన్న యువకుణ్ణి కృష్ణమూర్తి అప్పుడే చూశాడు.

"ఎవరి కోసం వచ్చారు, మీరు?" మెల్లగా అడిగాడు కృష్ణమూర్తి.

"కృష్ణమూర్తిగారి కోసం —"

"నేనే ఆకృష్ణమూర్తిని........"

ఆ అమ్మాయి అతనివంక చిత్రంగా చూసింది. ఆమె కళ్ళు ఆశ్చర్యంతో రెప రెప లాడాయి. "మీ పేరు కృష్ణ మూర్తా?"

"అవును"

"అయితే మీరు నన్ను క్షమించాలి. నావలన చాలా పొరబాటుజరిగిపోయింది. ఆమె మృదువుగా మాట్లాడుతుంటే కృష్ణ మూర్తికి చాలా ఆహ్లాదంగా ఉంది. ఆవేళ అతన్ని ఇద్దరమ్మాయిలు కఠినంగా నిందించేరు. ఇంట్లో భార్య సరేసరి!

ఆ పరిస్థితుల్లో ముక్కు మొఖం ఎరగని ఒక అందమైన అమ్మాయి తనను క్షమించమని అడగడం అతన్ని గతాన్ని మరిపింప జేసింది.

"ఇంతకీ మీ రెవరో నాకు తెలియదు. మిమ్మల్నెందుకు క్షమించాలో......"
అతన్ని మధ్యలో ఆపి ఆమె అంది.

"నాపేరు రాధ."

కృష్ణమూర్తి ఉలిక్కిపడ్డాడు. రాధ! ఈవేళ సాయంత్రం తను బీచిదగ్గర వెదికిన రాధ. తను కలుసుకోవాలని తపించిపోతూన్న రాధ — ఇప్పు డెదురుగా నిలబడి ఉంది. తను అనేక అవమానాలకూ, ఇంట్లో సౌఖ్యానికీ దూరమవడానికి కారణమై — తన్ను చిత్రవధ చేయాలనుకున్న రాధ — తన ఎదురుగా సౌందర్యమూర్తిగా నిలబడింది. ఈ రాధే తనకూ, అలివేణికీ మధ్య పెద్ద అగాధంగా నిలిచింది. ఇప్పుడు అనిపించింది. ఆమెను ఎన్నో అడగాలనుకున్న కృష్ణమూర్తి — ఆమె ఎదురుగా నిలబడడంతో ఏమీ మాట్లాడకుండా అచేతనంగా ఆమెవంకే అలా చూస్తూ నిలబడిపోయాడు.

కృష్ణమూర్తి అవస్థను గమనిస్తూన్న రాధ వెనకాల వున్న యువకుడు ముందుకువచ్చాడు. "నేను మీకు ముందు ఈ ఇంట్లో ఉండేవాడిని. పదిహేను రోజుల క్రితం మేమీ యిల్లు ఖాళీచేసి మా ఆఫీసు దగ్గిరోకి మారిపోయాం. ఈ విషయం నేను రాధకు చెప్పడం మర్చిపోయాను. తరువాత నే నామెను కలుసుకోడంకూడా పడలేదు. ఈ పదిహేను రోజుల్లోనూ ఆమెను ఒక్కసారి కలుసుకున్నాను. వారం రోజులుగా ఆఫీసు క్యాంపులో ఉన్నాను. ఈ వేళే వచ్చాను"

కృష్ణమూర్తికి కొద్దికొద్దిగా అర్థమవుతోంది. "మీపేరు!"

"కృష్ణమూర్తి!" అన్నాడు తను.

బాంబుపేలినట్లు ఉలిక్కిపడ్డాడు కృష్ణమూర్తి. "నా కిప్పుడంతా అర్థమవుతోంది." అన్నాడు అప్రయత్నంగా.

"అదే–మన ఇద్దరిపేర్లూ ఒకటే కావడంతో మీభార్య బహుశా మిమ్మల్ని అనుమానించి ఉంటారు. అందుచేతనే కృష్ణమూర్తికి వివాహ మయిందని రాధకు చెప్పేరు. ఆమె మాటలు నమ్మేసింది. అదృష్టవశాత్తు నాకు బీచి దారిలో ఎదురయింది. ఈమెను నమ్మించేసరికి నా తల ప్రాణం తోకకు వచ్చింది. నిజానిజాలు తెల్చుకోడానికే ఇక్కడకు వచ్చాం. ఆడవాళ్ళకు అనుమానం వస్తే...... అది మీకు అనుభవమే అయుంటుంది." అన్నాడతను నవ్వుతూ.

కృష్ణమూర్తికి ఆనందం కట్టలు తెంచుకు వచ్చింది. "అలివేణీ!" అన్నాడు గట్టిగా. అలివేణి ప్రవేశించింది.

"అంతా విన్నాను." అంది అలివేణి.

"మమ్మల్ని మీరు క్షమించాలి. మా వల్ల మీకు చాలా బాధ కలిగింది." అన్నాడా యువకుడు, కృష్ణమూర్తి నవ్వి "ఇందులో మీదేముందండీ — కాని మొత్తానికి పెద్ద తమాషాయే జరిగింది," అన్నాడు.

"మరి వస్తామండీ;" అంది రాధ అలివేణివంక చూస్తూ. అలివేణి ఏదో

బొమ్మలా తలూపింది. ఇద్దరూ వెళ్ళి పోయారు.

అలివేణి కళ్ళనీళ్ళింక ఆగలేదు. "నన్ను క్షమించరూ – మిమ్మల్ని అనవసరంగా అనుమానించాను" అంది ఆమె.

"ఛా-అదేమిటీ-ఇందులో నీ తప్పేముంది. పరిస్థితులలా వచ్చేయి." అన్నాడు కృష్ణమూర్తి ఆమెకన్నీటిని కర్చీఫ్‌తో ఒత్తుతూ.

"రండి – భోజనం చేద్దురుగాని" అంది అలివేణి ఏడ్పును దిగమింగి.

"ఎన్నాళ్ళకి ఈ కమ్మని పిలుపు!" కృష్ణమూర్తి టైమ్ చూసుకున్నాడు. తొమ్మిదిన్నర దాటింది. "ఇప్పుడేం భోజనం –" అన్నాడు నసుగుతూ. అన్నాడేకాని ఆకలి వేస్తూనేఉంది.

"అవేమీ కుదరవు – ఇంత రావలసిందే" ఆమె ఆజ్ఞాపించింది,

"అయితే ఒక షరతు – నువ్వే తినిపించాలి"

అలివేణి నవ్వి – "మీరు మరీ చిన్నపిల్లలయి పోతున్నారు. రండి!" అంది. ఆమె అంగీకారం అందులోనే ఉంది.

భోజనాలయ్యాక అన్నాడు కృష్ణమూర్తి-"అబ్బ! అనవసరపు అనుమానాలతో మొన్న చక్కని పున్నమి వెన్నెల రాత్రిని వ్యర్థం చేశావు. ఎంత బాధపడ్డానో ...." ఒక్క క్షణం ఆగి మళ్ళీ అన్నాడు కృష్ణమూర్తి. "కానీ-వేణీ – నీవు తలచుకుంటే ఈ రాత్రిని వెన్నెల రాత్రిని చేయగలవు"....

"అబ్బ ఆపండి" ........ అంది అలివేణి.

తరువాత...

